# జీవితం వెనక్కి పోదు

విమల సెక్రటేరియట్‌లో టైపిస్టు ఉద్యోగంలో చేరి నాలుగు సంవత్సరాలు అయింది. నాలుగేళ్ళుగా యాంత్రికంగా ఆఫీసుకి వెడుతూ, వస్తూ ఉండే విమలకి తన సెక్షన్‌లోనే కొత్తగా వచ్చిన మూర్తితో పరిచయం అయింది. ఆ పరిచయం పెరిగి పెరిగి పెళ్ళి చేసుకునేవరకూ వచ్చింది.

ఇంక పెళ్ళి చేసేసుకోవాలి అని నిశ్చయించుకున్నారు.

"విమలా! మీ తల్లిదండ్రులని మా ఇంటికి పంపు! మా పెద్దవాళ్ళు మాట్లాడతారు" అన్నాడు మూర్తి.

"మూర్తీ! మీ పెద్ధవాళ్ళు అంటున్నావు. మానాన్న కట్నం గిట్నం ఏమీ ఇవ్వలేరు తెలుసుగా" విమల ఖచ్చితంగా చెప్పేసింది.

"ఆ మాటలన్నీ వాళ్ళు మాట్లాడుకుంటారు. మనకెందుకు?"

"సరే, రేపే పంపిస్తాను" అని చెప్పి ఇల్లు చేరి తల్లిదండ్రులకీ విషయం చెప్పేసింది. రామారావూ, జానకమ్మ ఇద్దరూ ఆశ్చర్యపోయారు.

"ఈ కాలంలో అంత మంచివాళ్ళు ఇంకా ఉన్నా రామ్మా? రేపే వెళ్ళి వస్తాం. చూడూ, పెద్ధవాళ్ళతో పెళ్ళి మాటలు మొదలేట్టామంటే ఒకపట్టాన మనని బయటపడనీయరు. మూర్తి నీమాట ఎలాగూ తీసి వెయ్యడు గనుక పెళ్ళికూడా ఆర్భాటంగా కాకుండా క్లుప్తంగా చేస్తారు మావాళ్ళు అని చెప్పి ఒప్పించమ్మా." తల్లి మాటలు విమలకి నచ్చలేదు.

"నాలుగు సంవత్సరాల నుంచీ నేతెచ్చి ఇస్తున్న జీతం పెళ్ళి ఖర్చులకి కూడా చాలదామ్మా" అని అడిగెయ్యాలని అనిపించిది తొందర పడటం ఎందుకు, తరువాత

చూసుకోవచ్చు అని ఆగిపోయింది. రాత్రి అంతా నిద్రపట్టలేదు. మూర్తితో పెళ్ళి అయిన తరవాత తన జీవితం ఎలా మలుచుకోవాలో,దాంపత్య జీవితం ఆనందంగా ఎలా గడపాలో వూహించుకుంటూ వూహాసౌధాలు కట్టుకోసాగింది. ఇక రాత్రికి నిద్రలోకి జారిపోయింది.

తెల్లవారింది, తను మామూలుగా ఆఫీసుకి వెళ్ళాలి. కానీ వెళ్ళ బుద్ధి కావటం లేదు. తల్లి 'ఇంట్లో ఉండవే విమలా' అంటుందేమో అని చూసింది. ఆవిడ అనలేదు. వియ్యాల వారింటికి ఏ జరీ చీరె కట్టుకు వెళ్ళాలా అని సతమతమవుతున్న తల్లి మీద విసుగు వచ్చింది.

'సరేలే, ఎన్నాళ్ళు ఇక్కడుండేది' అనుకుని ఆఫీసుకి వెళ్ళిపోయింది. మూర్తి కోసం చూసింది. అతను సెలవు పెట్టాడని తెలుసుకుంది. ఆఫీసులో అసలు ఉండబుద్ధి కాలేదు. ఇంటికి వెళ్ళిపోతే! వద్దు. నవ్వగలరు ఇప్పటికే అందరూ పెళ్ళి ఆలస్యం అయిందని, ముదిపెళ్ళి కూతురు అనుకుంటూ నవ్వుకుంటున్నారు. తను కావాలని ముది పెళ్ళి కూతురు కాలేదు. తల్లి దండ్రుల ప్రయత్న లోపం వల్లగానీ, ఆర్థిక పరిస్థితి వల్లగానీ ఆలస్యం అయింది. పూర్వకాలం ఆడపిల్లలకి ఇలాంటి కష్టాలు ఉండేవి కావు. ఆ కాలం తల్లిదండ్రులకి వయసు వచ్చిన ఆడపిల్ల ఇంట్లోఉంటే అన్నం సయించేదికాదు. నిద్ర పట్టేది కాదు. ఆస్తులు అమ్మో, చందాలు పోగు చేసో ఆడపిల్లని ఒక అయ్య చేతిలో పెట్టి అత్తగారింటికి పంపి 'అమ్మయ్య' అనుకునేవారు. ఆకాలంలో స్త్రీకి 'పెళ్ళి' సమస్య అయ్యేది కాదు. కానీ ఈ కాలంలో స్త్రీకి పెళ్లి ఒక పెద్ద సమస్య అయిపోయింది. చదువులూ, ఉద్యోగాలూ ఎన్ని ఉన్నా పెళ్ళికొడుకు వారికి సంతృప్తి కలగడంలేదు. ఎందువల్లనో తెలియదు. ఏది ఏమైతేనేం తన పెళ్ళి ప్రేమించిన మూర్తితో జరగబోతూ ఉంది. ఈ జన్మకి ఆ అదృష్టం చాలు. మూర్తి అందంగా హుషారుగా ఉంటాడు. తన తోటి ఉద్యోగినులు ఈర్ష్య పడేలా తన వైవాహిక జీవితం ప్రారంభం కాబోతుంది. తులసికి ముప్పై నాలుగేళ్లు వచ్చినా పెళ్లి కాలేదు. అలాగే గీత క్కూడా. ఈ ఇద్దరే కాదు. పరీక్షగా చూస్తే ఇలాంటి ముది పెళ్లికూతుళ్ళు చాలామంది కన్పిస్తూన్నారు. తనకి మాత్రం ఆ ఖర్మ పట్టటం లేదు. విమల తనలో తను ఆలోచించుకుంటూ పనిలో మనస్సుని లగ్నం చేయలేక ఎలాగో అయిదు గంటలు గడిపి సీటులోంచి లేచింది.

సెక్షన్ సూపరింటెండెంటుకి చెప్పి ఇంటికి వచ్చేసింది. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. చెల్లెలు కమల చిరుచాప పరుచుకుని కూర్చుని లెక్కలు చేసుకుంటూ ఉంది.

"కమలా! అమ్మా, నాన్నా వాళ్ళింటికి వెళ్ళారా?" అంది హేండ్ బాగ్ టేబిలు మీదకి విసిరి.

"ఇంకా రాలేదా!" అంటూ లోపలికి వెళ్ళి బట్టలు మార్చుకుని స్నానం చేసి ఫ్లాస్కులో ఉన్న టీ కప్పులో పోసుకుని వచ్చి చెల్లెలికి ఎదురుగా కుర్చీ లాక్కుని కూర్చుంది. ఎదురుగా బట్టలు వేసుకునే తాడుమీద పొద్దున తల్లి కట్టుకు వెళ్ళాలనుకున్న జరీ చీరె మడత నలిగి కన్పించింది.

"కమలా! నాన్నా. అమ్మా మూర్తిగారింటనించి వచ్చేశారా!" ఆత్రంగా అడిగింది. మళ్ళీ

"వూఁ! వచ్చేశారుగా!"

"వచ్చేశారూ! ఏమన్నారు వాళ్ళు? లగ్నాలు పెట్టుకున్నారా! పెట్టుకుంటే ఎప్పుడూ?" టీ కప్పు వదిలేసి ఆత్రతగా చెల్లెలి భుజాలు పట్టుకుని అడిగింది. కమల పుస్తకాలు పక్కకి పెట్టి అక్క ముఖంలోకి చూసింది క్షణం. "అక్కా! అక్కడ ఏమైందో నీకు తెలియదూ" అంది.

"ఏమైంది? నాకు తెలియదే. త్వరగా చెప్పు."

"మూర్తిగారు కన్పించలేదా?"

"లేదు. ఆఫీసుకు రాలేదు."

"అయితే విను. నాన్నా, అమ్మా వెళ్ళారా? మూర్తి, అతని తల్లిదండ్రులూ మర్యాదగానే మాట్లాడారట. పెళ్ళి లగ్నాలు పెట్టుకుందాం అని ఆ మాటా ఈమాటా చెప్పి 'మేం డబ్బు మనుషులం కాదు కనకనే పైసా కట్నం కావాలని అడగం. అయితే మా అబ్బాయి ఒక చిన్న ఇళ్ళ స్థలం కొనుక్కోవాలనుకుంటున్నాడు. స్కూటర్ కొనుక్కోవాలని ఎన్నాళ్ళగానో అనుకుంటున్నాడు. కనుక మీ చేతి డబ్బులేం మేము కోరటం లేదు. అమ్మాయి నాలుగేళ్ళుగా తెస్తూన్న జీతం తాలూకు పైకం సర్దేస్తే చాలు" అన్నారట.

కమల చెప్పటం ఆపింది.

విమల నిర్ఘాంతపోయింది.

"అలా అని అడిగారా! అప్పుడక్కడ మూర్తి ఉన్నాడా?"

"ఉన్నాడట!"

"తర్వాత?" విమల గుండె బిగపట్టుకుని అడిగింది.

"ఏముంటుందక్కా, ఆ జీతం తాలూకు డబ్బు ఇంకెక్కడిది? ఇంటి ఖర్చులకే ఖర్చు అయింది. మీరు వూరికే చేసుకున్నా పెళ్ళి ఆర్భాటంగా చేయటానికే నాదగ్గర డబ్బులేదు అన్నాడట నాన్న."

"అప్పుడు వాళ్ళు ఏమన్నారు?"

"ఏమంటారక్కా! ఏమీ అనరు వెళ్ళి రండి అన్నారట."

"మరి మూర్తి?"

"మూర్తీ-మూర్తీ-మూర్తీ! అతనూ అంతే అన్నాడట. ఇంత అడవి మనుషులు అనుకోలేదు' అని విసురుగా లోపలికి వెళ్ళిపోయాడట. అతని తండ్రి మన నాన్నని నానా చీవాట్లూ పెట్టాడట. ఆడపిల్లకి కట్నం అంటూ ఎదురిచ్చి పెళ్ళి చేయవల్సింది పోయి ఆ పిల్ల తెచ్చిన జీతం డబ్బు కూడా తినేశావా, నాయనా? మీలాంటి వాళ్ళకి ఒక నమస్కారం. వెళ్ళి రండి అనేసి లేచిపోయారట."

"కమలా, ఇలా నిజంగా జరిగిందా!"

"నిజం-నిజం-నిజం. అక్కా కలలు కనకు. కలలు మనలాంటి మధ్యతరగతి ఆడపిల్లలకి ఆరోగ్యప్రదం కాదు." కమల నిట్టూర్చింది

"నాన్నా వాళ్ళూ ఎక్కడికి వెళ్ళినట్లు?"

"నీ పెళ్ళి ఎప్పటికి అవుతుందో ఎలా అవుతుందో తెల్సుకోవాలని జ్యోతిష్కుడి దగ్గరికి వెళ్ళారు.

"ఛీ!" విమల వచ్చే కన్నీళ్ళని ఆపుకోవటానికి వ్యర్థ ప్రయత్నం చేస్తూ అంది.

"అక్కా! నీకు మూర్తి తల్లిదండ్రుల మీద చాలా కోపం వస్తూంది కదూ! వాళ్ళు కనిపిస్తే చంపాలనిపిస్తూంది కదూ! మూర్తిని నీకు కాకుండా చేశారని నీ మనస్సు భగ్గుమంటూంది కదూ!"

"అవును"

"అక్కా, కోపగించుకోకు. అది మనలాంటివారికి మంచిది కాదు."

"కమలా! నీతులు చెప్పకు. నా గుండె మండిపోతుంది."

"నీ బాధని నేను అర్థం చేసుకోగలనక్కా. కానీ , నీ పెళ్ళి ఇలా అవటానికి మూర్తి తల్లిదండ్రులతో బాటు మన తల్లిదండ్రుల బాధ్యతారాహిత్యం కారణం అంటాను కాదంటావా!"

విమల జవాబు చెప్పలేని దానిలా లేచి మంచంమీద వాలిపోయింది. కన్నీళ్ళు కాల్వలు కడుతున్నాయి. కమల లేచి వచ్చి అక్కని వోదార్చసాగింది.

"అక్కా! ఈప్రపంచం చాలా విశాలమైంది. మూర్తి ఒక్కడే మనిషి అనుకోకు. మంచివాళ్ళని వెతుక్కోగలగాలి గానీ దొరుకుతారు. అయితే నువ్వు సహనంగా ఉండాలి."

"అక్కా! మనం చదువుకున్నాం. ఈ కాలపు పరిస్థితులు అర్థం చేసుకున్నాం. ధైర్యంగా నిలబడగలగాలంటే ముందీ ఏడుపు రానివ్వకూడదు. ఏడిచి హృదయ భారాన్ని తగ్గించుకోవటం తప్ప మరేం సాధించలేం. లే కళ్ళు తుడుచుకో. ముఖం కడుక్కో. అమ్మా నాన్నా వచ్చే వేళ అయింది. ఎవరి సానుభూతి నువ్వు కోరకు. కొందరు సానుభూతి చూపి బాధ్యతని విస్మరిస్తారు. ఇలాంటి వాళ్ళంటే నాకు చికాకు. డీలాపడకు. ఏమీ జరగనట్లే రేపే ఆఫీసుకు వెళ్ళు."

విమల కన్నీళ్ళు తుడుచుకుంటూ అంది.

'ఒకసారి మూర్తిని కలిసి మాట్లాడితే?..."

"అక్కా, నువ్వు ఒట్టి పిచ్చిదానివి. అతని ఎదురుగానేగా ఇదంతా జరిగింది. మెడ పట్టుకుని గెంటుతూంటే చూరు పట్టుకుని వేలాడే మనస్తత్వం మార్చుకోవాలక్కా.'

"అతనుగా వచ్చి ఈ విషయం మాట్లాడితే మాట్లాడు. లేకపోతే పెదవి కదపవద్దు."

విమల మవునంగా ఉండిపోయింది.

మరునాడు విమల ఆఫీసుకి వెళ్ళింది. కానీ మూర్తి రాలేదు. కానీ సెక్షన్‌లో గుసగుసలు ప్రారంభమైనాయి. అవి వినీ విననట్లు వూరుకుంది విమల. ఒకరిద్దరు దగ్గరికి వచ్చి ఏదో అడగబోయారు. విమల సీరియస్‌గా ముఖం పెట్టింది. అంతే. వాళ్ళు ఇంకేదో మాట్లాడి వెళ్ళిపోయారు. మరో రెండు రోజులకి మరో సెక్షన్‌లో పని చేసే పార్వతి పని కట్టుకు వచ్చింది లంచ్ టైములో. టిఫిను తింటూనే విమల నడిగింది.

"విమలా, ఇదేమిటోయ్? మూర్తి, నువ్వు పెళ్ళి చేసుకోబోతున్నారనిచెప్పావు. కానీ అతను రెవెన్యూలో పని చేస్తున్న పద్మని పెళ్ళాడబోతున్నాడట. లగ్నాలు కూడా పెట్టుకున్నారట."

"వూఁ" మనసులోని హాలాహలాన్ని మింగేస్తూ అంది.

"పద్మ నీకంటే మూడేళ్ళు సీనియర్. ఉద్యోగంలో చేరినప్పటి నుంచీ వచ్చిన జీతం లెక్క కట్టి మరీ ఇమ్మన్నారట. పద్మ తండ్రి ఇస్తున్నాడట."

"అవునా!"

"అవును."

'రోగ్ అనుకుంది మనస్సులో కచ్చగా.

నీకెలా తప్పిందే?" కుతూహలంగా అడిగింది పార్వతి.

"ఏం లేదు."

పార్వతి మూతి ముడుచుకుని వెళ్లిపోయింది.

కొన్ని రోజులు సాఫీగా గడిచిపోయినాయి.

మూర్తి ఆఫీసుకి వస్తున్నాడు. రెండు రోజులు ముఖం తిప్పుకున్నాడు. మూడోరోజు నుంచీ గర్వంగా చూడసాగాడు. విమల అతన్ని పట్టించుకోలేదు. కానీతన పెళ్లి శుభలేఖ తప్పక ఇవ్వటానికి వస్తాడనీ, అప్పుడు అందరిముందూ నాలుగు దులిపేయాలని ఎదురుచూడసాగింది. ఎన్నాళ్ళు జరిగినా అతని పెళ్లి శుభలేఖ ఆఫీసులో ఎవరికి రాలేదు అందరూ కుతూహలం ఆపుకోలేక విషయం ఆరా తీశారు ఆవార్త విమల చెవిన వేయాలని చూశారు. కానీ విమల ఆసక్తి చూపలేదు. అంతే వాళ్ళు ఆగిపోయారు.

పద్మ పెళ్లి శుభలేఖలు తెచ్చి స్నేహితులకి, విమలకీ ఇస్తూ "విమలా, ఆదివారం సాయంకాలం అశోకాలో పార్టీ తప్పక రండి. నా పెళ్ళి రిజిస్టర్ మారేజీ, అందువల్ల పార్టీకి మాత్రమే పిలుస్తున్నాను." అంటూ హుషారుగా వెళ్ళిపోయింది. పార్వతి పరుగున వచ్చింది.

"విమలా! ఈ చిత్రం విన్నావా! పద్మ మూర్తిని మోసం చేసింది కొత్తగా ఒక ఆఫీసర్‌తో పరిచయం అయి, అది ప్రేమగా మారిందట. ఆయన తన జీతం కావాలనలేదట అందుకని లగ్గాలు పెట్టుకున్నా, ఆ పెళ్లి ఆపుకుని ఈ పెళ్లి చేసుకుంటూందట. పాపం! మూర్తి. అతని తల్లి దండ్రులూ పరువు పోయిందని బాధ పడిపోతున్నారు. అంత క్రితం మీరు ఇద్దరూ పెళ్ళాడాలని అనుకున్నారుగా! పోనీ మళ్ళీ ప్రయత్నించి చూడకూడదూ!" సలహా ఇచ్చింది.

"ఛీ, ఛీ." అంది విమల, అంతే పార్వతి వెళ్లిపోయింది.

మరో నెల తరవాత విమల ఆఫీసునుంచి ఇంటికి వస్తూంటే దారిలో మూర్తి కలుసుకున్నాడు. ముఖం చిన్నగా చేసుకుని బాధపడిపోతూ అన్నాడు.

"సారీ, విమలా! మనం అనుకోని సంఘటనలు చాలా జరిగిపోయినాయి. ఇది ఇద్దరం మరిచిపోదాం. మనం పెళ్లి చేసుకుందాం' ఏమంటావు విమలా?"

"ముందు ఆ ఏకవచనం ఆపమంటాను." కర్కశంగా అంది.

"విమలా!"

విమలగారూ అనాలి. మళ్ళీ మళ్ళీ చెబుతున్నాను మూర్తీ. తెలిసి చేసినా తెలియక చేసినా, కొన్నితప్పులు సవరించబడవు. ఎందుకంటే జీవితం వెనక్కి పోదు కనక."

"విమలా!"

"మాట్లాడవద్దు ఇంక."

"రత్నాన్ని రాయి అనుకున్నాను. రాయిని రత్నం అనుకున్నాను."

బాధగా అన్నాడు మూర్తి. అసలైన పశ్చాత్తాపం కనిపిస్తూంది అతని కళ్లలో. అతను ఇంకా ఇంకా ప్రాధేయపడసాగాడు.

"విమల్గా, ప్లీజ్."

"ఆపు, నాకు పెళ్ళి ఖాయం అయింది. వారం రోజులే ఉంది. పెళ్లికొడుకు లెక్చరర్. ఇంక చాలుగా!"

విమల ఇంటివైపు సాగిపోయింది.

మూర్తి శిలావిగ్రహంలా నిలుచుండిపోయాడు.

*(ఆంధ్రప్రభ 14-10-81)*